క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గుర్జాల్ తండాలో ఆంజనేయ ఆలయ నిర్మాణానికి దేవాదాయ శాఖ నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయించినట్లు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ తెలిపారు. గురువారం ఎమ్మెల్యే, జెడ్పీటీసీ శంకర్ నాయక్‌తో కలిసి తండాను సందర్శించి సదరు పత్రాలను సర్పంచ్ దశరథ్ నాయక్‌కు అందజేశారు. భక్తి శ్రద్ధలతో ఆలయాన్ని నాణ్యతతో అవకతవకలు లేకుండా సకాలంలో నిర్మించాలని ఎమ్మెల్యే సూచించారు.

నటేశ్వరశర్మకు సన్మానం



కామారెడ్డి టౌన్: దాశరథి కృష్ణమాచార్య స్మారక పురస్కారానికి ఎంపికైన జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ రచయిత, సంస్కృతాంధ్ర కవి అయాచితం నటేశ్వరశర్మను గురువా రం టీఎస్‌పీఎస్సీ సభ్యురాలు సుమిత్రానంద్ ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనకు పురస్కారం రావడం జిల్లాకు గర్వకారణమన్నారు.

మైనార్టీ కమిషన్ సభ్యురాలిని కలిసిన ఏబీవీపీ నేతలు



కామారెడ్డి టౌన్: జిల్లాలో అధికార పర్యటనలో ఉన్న జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాదీని ఏబీవీపీ పూర్వ విద్యార్థులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఘనంగా సన్మానించారు. ఏబీవీపీ పూర్వ కార్యకర్త కావడంతో ఆమెతో మాట్లాడినట్లు వారు తెలిపారు. పూర్వ నాయకులు రాజాగౌడ్, జంగం నరేశ్, నారాయణ, గిరి, స్వామిరెడ్డి, నాగారాజు, జూలురి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన జెడ్పీ మాజీ చైర్మన్



నిజాంసాగర్(జుక్కల్): తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్‌చైర్మన్ మఠం భిక్షపతి ప్రమాణ స్వీకారణ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ కవితను గురువారం ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల అభ్యున్నతితో పాటు బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ కవిత ఆయనకు సూచించినట్లు చెప్పారు.

కాచాపూర్ గ్రామస్తుల వినూత్న నిరసన



భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ నుంచి కాపాడండి అంటూ వినూత్న నిరసన కార్యక్రమం గురువారం కాచాపూర్ గ్రామస్తులు నిర్వహించారు. కాచాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 87వ రోజుకు చేరుకున్నాయి. వర్షం కురుస్తున్నా గ్రామస్తులు దీక్ష శిబిరం వద్ద గొడుగులు పట్టుకుని వానలో నిలబడి రోడ్డు వైపునకు వీపులు చేసి నిరసన తెలిపారు. ఫ్యాక్టరీ యాజమాన్యం మాట ఇచ్చి నిలబెట్టుకో లేదంటూ పెద్ద ఎత్తున నినాదించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన తెలిపారు.

తారు రోడ్లపై కేజ్‌వీల్‌తో ట్రాక్టర్లు నడపొద్దు



ఎస్సై కోనా రెడ్డి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): తారు రోడ్లపై కేజ్ వీల్ ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కోనారెడ్డి హెచ్చరించారు. ప్రజాధనంతో చేపట్టిన రోడ్లను ధ్వంసం చేయవద్దని జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాలిచ్చారని, కేజ్ వీల్స్ బిగించి రోడ్లపై నడపడం వల్ల రోడ్లన్నీ ధ్వంసమై ప్రజాధనం వృథా అవుతోందని ఆయన అన్నారు.

వంతెన నిర్మాణం జరిగేదెన్నడో ?

- కల్యాణి వాగు ప్రవాహంతో కల్యాణి, రత్నాపూర్ గ్రామస్తులకు ఇబ్బందులు
- రెండు కిలో మీటర్ల ప్రయాణానికి 10 కిలో మీటర్ల ప్రయాణం చేస్తున్న ఇరు గ్రామాల ప్రజలు



కల్యాణి వాగుపై వంతెన నిర్మించాల్సిన స్థలం.. సర్కిల్‌లో వాగు దాటుతున్న గ్రామస్తుడు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని కల్యాణి వాగుపై వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో కల్యాణి, రత్నాపూర్ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాగు ప్రవహించే సమయంలో ప్రమాదకర పరిస్థితుల్లో దాటాల్సి వస్తోందని ఇరు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కల్యాణి వాగుపై త్వరగా వంతెన నిర్మాణం చేపట్టాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కల్యాణి గ్రామం నుంచి రత్నాపూర్ గ్రామానికి వాగు మధ్యలో నుంచి దారి ఉంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. కల్యాణి గ్రామానికి చెందిన రైతుల పొలాలన్నీ రత్నాపూర్ శివారులో ఉండడంతో వారు పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రత్నాపూర్ గ్రామ ప్రజలు సైతం ప్రతి పనికి వారు ఎల్లారెడ్డికి కల్యాణి గ్రామం మీదుగా వెళ్తారు. అలాగే రత్నాపూర్‌లో ప్రాథమిక పాఠశాల వరకు మాత్రమే ఉండడంతో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకునేందుకు కల్యాణి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు రావాల్సి ఉంటుంది. విద్యార్థులు రత్నాపూర్ నుంచి కల్యాణి గ్రామానికి వాగు మీదుగా రావాలంటే రెండు కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. కానీ వాగు వచ్చిందంటే తిమ్మారెడ్డితండా మీదుగా చుట్టూ తిరిగి పది కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి ఉంటుంది. రెండేళ్ల క్రితం వాగు దాటి వెళ్తుండగా ఇద్దరు కొట్టుకుపోయి మృతి చెందారు. అదే విధంగా వాగు దాటుతున్న సమయంలో పశువులు సైతం కొట్టుకుపోయిన ఘటనలు ఉన్నాయి. ఇన్ని సమస్యలను దూరం చేయాలంటే వాగుపై వంతెన నిర్మించాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భయం మధ్య దాటాల్సి వస్తోంది



కల్యాణి గ్రామానికి చెందిన వారి పంట పొలాలు రత్నాపూర్ గ్రామ శివారులో ఉన్నాయి. వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో పోవడానికి ఇబ్బందిగా ఉంటుంది. 2 కిలో మీటర్ల దూరానికి పది కిలో మీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సి వస్తోంది. – మియాజాని, రైతు, కల్యాణి

త్వరగా వంతెన నిర్మించాలి



కల్యాణి వాగుపై వంతెన త్వరగా నిర్మించాలి. వర్షాకాలంలో వాగు నుంచి రావాలంటే భయమేస్తుంది. పాఠశాలకు రావడానికి పది కిలో మీటర్ల దూరం నుంచి రావాల్సి వస్తుంది. వంతెన నిర్మిస్తే ఇబ్బందులు తీరుతాయి. – అర్చన, 8వ తరగతి, రత్నాపూర్

ప్రతిపాదనలు పంపాం

కల్యాణి వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వానికి రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే వంతెన నిర్మాణ పనులు చేపడతాం. – కృష్ణ, పంచాయత్ రాజ్ ఏఈ, ఎల్లారెడ్డి

బీజేపీ నాయకుల రాస్తారోకో



ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు

లింగంపేట(ఎల్లారెడ్డి): కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా గురువారం బీజేపీ నాయకులు లింగంపేట అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు దత్తురాం మాట్లాడారు. చలో బాట సింగారం కార్యక్రమంలో భాగంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల స్థలాలు, ఇల్లు పరిశీలించడానికి వెళ్తున్న నాయకులను అడ్డుకోవడం బీఆర్ఎస్ చేసిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికేనని అన్నారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మురళి, బొల్లారం సాయన్న, రాంచందర్, నవీన్, బాలయ్య పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సుధాకర్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై తహసీల్దార్ సుధాకర్ ఓటర్లకు అవగాహన కల్పించారు. గురువారం స్థానిక తహసీల్ కార్యాలయంలో, మండలంలోని వెల్లుట్ల, వెల్లుట్లపేట, వెంకటాపూర్ గ్రామాలలో ఓటు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎంపీవో ప్రకాష్, సర్పంచులు చిరంజీవులు, సురేఖ, రాజేశ్వరి, గిర్దావర్ శ్రీనివాస్ తదితరులున్నారు.

హరితహారం పనులు వేగవంతం చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీడీవో

నస్రుల్లాబాద్(బాన్సువాడ): హరితహారం పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఫీల్డ్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో హరిత హారం పనులు వేగవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా మొక్కలు నాటించాలన్నారు. ఏపీవో సౌజన్య, సిబ్బంది లావణ్య, ఫీల్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 115 మంది ఎంపిక



ఎంపికైన వారితో కంపెనీల ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: బహుళజాతి కంపెనీలు జాబ్‌మేళాలో కళాశాలకు రావడం వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.కిష్టయ్య అన్నారు. గురువారం కళాశాలలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, టీఎస్‌కేసీ సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ ఎం.చంద్రకాంత్ మాట్లాడారు. జాబ్‌మేళాలో ఐసీఐసీఐ బ్యాంక్, అమెజాన్, హెచ్‌డీఎఫ్‌సీ, లాట్ మొబైల్, స్పందన స్ఫూర్తి ఫైనాన్స్, అల్ట్రాస్ట్ కంపెనీలు 115 మంది విద్యార్థులను ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. ప్లేస్‌మెంట్ సమన్వయకర్త ఫర్హీన్ ఫాతిమా, మెంటార్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువల్లో పూడిక తొలగింపు



నిర్మాణాలను కూల్చేస్తున్న సిబ్బంది

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సిరిసిల్లరోడ్‌లోని బడా మురికి కాలువ పూర్తిగా నిండుకుని చిన్నపాటి వర్షానికి కాలువ పొంగిపోతోంది. దీంతో మురుగునీరంతా కాలనీలోకి చేరుతుంది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక వార్డు కౌన్సిలర్ అంజల్‌రెడ్డి స్పందించి బుధవారం మురికి కాలువలపై ఉన్న నిర్మాణాలను కూల్చివేయించారు. ప్రొక్లెయిన్‌లతో పూడికలు తీసివేయించారు. దీంతో మురుగు, వర్షపు నీరు ప్రవాహం వేగంగా పోతుంది. తాత్కాలికంగా సమస్యను పరిష్కరించారని, పూర్తిగా సమస్య పోవాలంటే మురికి కాలువ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



పిట్లం: వర్షంలోనూ సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు



రాజంపేటలో..

సాక్షి నెట్‌వర్క్:భారీ వర్షంలోనూ గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెను కొనసాగించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా కొద్ది రోజులుగా వారు సమ్మె చేస్తున్న సంగతి తెల్సిందే. గురువారం దీక్షా శిబిరాల్లో కూర్చుని వారు నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు.

అలాగే మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కార్మికులు కోరారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పలు పార్టీల నేతలు వీరికి సంఘీభావం ప్రకటించారు.

పరవళ్లు తొక్కుతున్న 'మంజీర'

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నాగిరెడ్డిపేట మండలంలో మంజీర నది పరవళ్లు తొక్కుతోంది. మెదక్ జిల్లాలో కురిసిన భారీవర్షం కారణంగా ఘనపూర్ ఆనకట్ట పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతుంది. దీంతోపాటు మెదక్ జిల్లాలోని హల్దీవాగు సైతం నిండుగా ప్రవహిస్తూ మంజీరనదిలో కలుస్తోంది.దీంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. గోలిలింగాల, చీనూర్, వాడి, లింగంపల్లి, వెంకంపల్లి, తాండూర్, మాటూర్, మాసాన్‌పల్లి గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఆయా గ్రామాలలో దండోరా వేయిస్తున్నారు.

రాజంపేటలో సోషల్ ఆడిట్

రాజంపేట: రాజంపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ లింగాల స్వరూప అధ్యక్షతన సామాజిక తనిఖీలో భాగంగా హియరింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయన్న, అదనపు ప్రాజెక్టు అధికారి శ్రీరామ్ నారాయణ ఆధ్వర్యంలో ఆయా గ్రామాలలో చేపట్టిన ఎన్ఆర్‌జీఎస్ పనులపై ఆరా తీశారు. గ్రామాలలో చనిపోయిన మొక్కల స్థానంలో నూతన మొక్కలు నాటాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఎంపీడీవో బాలకిషన్, ఎంపీవో రఘురాం, ఆయా గ్రామాల ఆడిట్ సిబ్బంది, కార్యదర్శులు, సర్పంచ్లు, జిల్లా రీసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం కామారెడ్డి పట్టణానికి చెందిన సబ్బని సాయికృష్ణ, మానస దంపతులు గురువారం రూ.5,116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఈవో ప్రభు రామ్‌చంద్రం, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా గంగారాం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన సుతారి గంగారాం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కొప్పుల నర్సారెడ్డి, ట్రెజరర్‌గా కమలాకర్ రావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన గంగారాం మాట్లాడుతూ.. క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో విస్తరింప జేసి క్లబ్ కమిటీలను ఏర్పాటు చేస్తానన్నారు. క్లబ్ ప్రతినిధులు మహిపాల్ రెడ్డి, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు బాన్సువాడలో స్పీకర్ పర్యటన

బాన్సువాడ రూరల్: బాన్సువాడ పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన భవన సముదాయంతో పాటు గోడౌన్‌ను శుక్రవారం అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు సంఘం అధ్యక్షుడు ఎర్వాల కృష్ణారెడ్డి తెలిపారు. అలాగే పాత బాన్సువాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. అనంతరం మీనాగార్డెన్‌లో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు.

అధ్వానంగా మారిన రోడ్డు



మాచారెడ్డి: మండల కేంద్రం నుంచి గజ్యానాయక్ తండా చౌరస్తా మీదుగా ఘన్‌పూర్(ఎం) రోడ్డు వరకు నిర్మిస్తున్న నాలుగు లేన్ల రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. రోడ్డు వెడల్పులో భాగంగా పాత రోడ్డును తొలగించి మట్టి పోశారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణ పనులు నత్త నడకన సాగుతుండడంతో పోసిన మట్టి వర్షానికి కొట్టుకుపోయి అధ్వాన్నంగా మారింది. ఆ గుంతల్లో నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. గురువారం ఓ ద్విచక్ర వాహనదారుడు గుంతలో పడి ఆస్పత్రి పాలయ్యాడు. అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చి వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

తెరపివ్వని వాన



కూలిన పోతంగల్ కలాన్ - కర్దం గడ్డ తండా కల్వర్టు



ఉధృతంగా ప్రవహిస్తున్న లింగంపేట పెద్దవాగు



తాడ్వాయి: బ్రాహ్మణపల్లిలో నిర్మిస్తున్న బ్రిడ్జి పక్కన కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. గురువారం కూడా భారీ వాన కురిసింది. ఈ కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోడ్లు చాలా చోట్ల కోతకు గురయ్యాయి. బలహీనంగా ఉన్న ఇళ్లు కూలాయి. భారీ వర్షాలతో వాగులు, వంకలు, చెరువులు పొంగి పొర్లడంతో ప్రమాదకరంగా ప్రవహిస్తున్న నీటి ప్రవాహాల వద్దకు ప్రజలెవరూ వెళ్లవద్దని అధికారులు సూచించారు. చెట్ల కింద, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఎవరూ నివసించొద్దన్నారు. ప్రజలందరూ విద్యుత్ పరికరాలకు సంబంధించిన వస్తువులతో దూరంగా ఉండాలని సూచించారు. కూలిన ఇళ్లను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. చాలా చోట్ల పంటలు నీట మునిగాయి, రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది.



అలుగు వరకు నిండిన కామారెడ్డి పెద్ద చెరువు



దేవునిపల్లిలో వర్షానికి కూలిన ఇల్లు



రామేశ్వర్‌పల్లిలో పాక్షికంగా కూలిన ఇల్లు



తాడ్వాయిలో ఇల్లును పరిశీలిస్తున్న కార్యదర్శి బాలు



తాడ్వాయిలో వర్షానికి కూలిన పెంటయ్య ఇల్లు



రాఘవపల్లిలో పరిశీలిస్తున్న ఎంపీడీవో రఘు

ఓటర్ జాబితాపై బీఎల్‌వోలకు శిక్షణ



మాట్లాడుతున్న ట్రైనర్ రాందాస్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో గురువారం బీఎల్‌వోలకు అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్ రాందాస్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్టోరల్ రూల్స్, కొత్త ఓటర్ల లిస్ట్‌పై ఆయన శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమంలో గిర్దావర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ మరమ్మతులకు నిధులు మంజూరు



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

దోమకొండ: దోమకొండ బస్టాండ్ మరమ్మతులకు రూ.29 లక్షల నిధులు మంజూరైనట్లు జెడ్పీటీసీ తీగల తిర్మల్ గౌడ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్యతో కలిసి ఆయన పరిశీలించారు. వర్షాలకు పెచ్చులూడి బస్టాండ్ ప్రమాదకరంగా మారిందని, ఈ విషయం గురించి తాము గతంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆర్టీసీ అధికారులతో మాట్లాడినట్లు వారు తెలిపారు.

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన బీజేపీ బృందం



ఆసుపత్రిలో రమణారెడ్డి, బీజేపీ నేతలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి, నాయకులు గురువారం సందర్శించారు. ఆస్పత్రిలో రోగులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ.. ఆస్పత్రిలో వర్షానికి భవనమంతా ఊరుస్తోందన్నారు. పై కప్పు పీవోపీ పడిపోయి తృటిలో ప్రమాదం తప్పిందన్నారు. కమీషన్ల కోసం కాంట్రాక్టర్‌లు నాసిరకంగా పనులు చేపట్టారని మండిపడ్డారు. ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు చెప్పినట్టుగా ఆస్పత్రులు అధ్వానంగానే ఉన్నాయన్నారు. బీజేపీ కౌన్సిలర్లు మోటూరి శ్రీకాంత్, నరేందర్, ప్రవీణ్, నాయకులు భరత్, సురేష్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

'సెలవు' ప్రకటనపై తల్లిదండ్రుల అసహనం



బొప్పాస్‌పల్లికి వెనుదిరిగి వెళ్తున్న విద్యార్థులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ పాఠశాలకు బొప్పాస్ పల్లి, మైలారం గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. అయితే వర్షాల వల్ల గురువారం ఆలస్యంగా సెలవు ప్రకటన చేయడంతో విద్యార్థులు వెనుదిరగాల్సి వచ్చింది. దీనితో సుమారు 3 కి.మీ మేర విద్యార్థులు వర్షంలో తడుస్తూ వెళ్లారు. సెలవుల ప్రకటన ముందస్తుగా చేయాల్సి ఉండే అని, ఇలా ఉన్నపళంగా చేయడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ప్రభుత్వంపై తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు.